రూటు మార్చిన ఐటీ



పొదుపు మంత్రం జపిస్తున్న కంపెనీలు • వేతన భారం దించే దిశగా అడుగులు
తగ్గుతున్న మధ్య, ఉన్నతస్థాయి ఉద్యోగులు • జూనియర్లకు దక్కుతున్న పెద్దపీట

న్యూఢిల్లీ, అక్టోబర్ 23: దేశీయ ఐటీ రంగ సంస్థలు రూటు మార్చాయి. ఇన్నాళ్లూ మధ్య, ఉన్నతస్థాయి ఉద్యోగుల నియామకాలపై దృష్టి సారించిన కంపెనీలు.. ఇప్పుడు జూనియర్లకు పెద్దపీట వేస్తున్నాయి. మిడ్, సీనియర్ ఎగ్జిక్యూటివ్‌ల స్థానంలో కొత్తవారిని తీసుకొస్తున్నాయి. అనుభవం ఉన్నవారిని ఎక్కువ జీతాలిచ్చి పెట్టుకోవడం కంటే.. ఫ్రెషర్లను తీసుకొని, వారిలో నైపుణ్యం పెంచేందుకు ఖర్చు పెట్టడమే లాభసాటి అని మెజారిటీ కంపెనీలు భావిస్తున్నాయి మరి. ఉద్యోగులపై పెట్టే వ్యయంలో నైపుణ్యాభివృద్ధికి చేసే ఖర్చు 5-7 శాతంగానే ఉంటున్నది. దీంతో తక్కువ జీతాల్లో జూనియర్ల నియామకాలే ఉత్తమం అన్న భావన యాజమాన్యాల్లో పెరిగిపోతున్నది.

ట్రెండ్‌కు భిన్నంగా..

గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు (జీసీసీ), దేశంలోని బహుళజాతి ఐటీ కంపెనీలు ఆకర్షణీయ వేతనాలతో ఉద్యోగ నియామకాలు చేపడుతున్నాయి. అయినప్పటికీ స్థానిక ఐటీ సంస్థలు మాత్రం పొదుపు మంత్రాన్నే జపిస్తుండటం ఇప్పుడు జాబ్ మార్కెట్‌లో మిక్కిలి ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నది. కాగా, భారతీయ ఐటీ సేవల కంపెనీల ఆదాయాల్లో ఎక్కువ మొత్తం పోతున్నది ఉద్యోగుల జీతాలకే. ఈ క్రమంలోనే వేతన భారాన్ని తగ్గిస్తే సంస్థ లాభాలు పెరుగుతాయన్న ఆలోచనతో జూనియర్ల వైపు చూస్తున్నాయిప్పుడు చాలా కంపెనీలు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికి గాను ఇటీవల ప్రకటించిన ఆర్థిక ఫలితాలనుబట్టి ఉద్యోగుల జీతాల ఖర్చును ఇప్పటికే ప్రధాన సంస్థలు తగ్గించేసుకున్నాయి. టీసీఎస్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ఇందుకు నిదర్శనం.

> *10 ఏండ్ల అనుభవం ఉన్న సీనియర్ ఉద్యోగుల స్థానంలో 3-5 ఏండ్ల అనుభవం కలిగిన ఇద్దరు, ముగ్గురు జూనియర్ ఉద్యోగులను నియమించుకొనేందుకే ఇప్పుడు ఐటీ సంస్థలు ఆసక్తి కనబరుస్తున్నాయి. ఆ ఒక్కరికిచ్చే జీతం కంటే ఈ ఇద్దరు, ముగ్గురికిచ్చేదే తక్కువగా ఉంటున్నది. దీనివల్ల వేతన భారం కంపెనీలపై తగ్గుతున్నది. మొత్తంగా చూసినట్లైతే నియామకాల ప్రక్రియ నెమ్మదించింది. దేశీయ ఐటీ రంగంపై అమెరికా ఎన్నికల ప్రభావం స్పష్టంగా కనిపిస్తున్నది.*
>
> *-నీతీ శర్మ, టీమ్‌లీజ్ డిజిటల్ సీఈవో*

> *రాబోయే త్రైమాసికాల్లోనూ దేశీయ ఐటీ రంగంలో నియామకాలు అంతంతమాత్రంగానే ఉండొచ్చు. జీతాల పెంపు, పదోన్నతులు, ప్రోత్సాహకాలు.. ఐటీ కంపెనీల ఆదాయానికి గండి కొడుతున్నాయి. ఇక అట్రిషన్ రేటు పెరగడం వెనుక జీసీసీల నుంచి ఐటీ ఉద్యోగులకు పెరుగుతున్న డిమాండ్, వెళ్లిపోతున్న ఉద్యోగులను ఆపేందుకు ఐటీ సంస్థలు పెద్దగా ప్రయత్నించకపోవడం కారణాలుగా నిలుస్తున్నాయి.*
>
> *-గురుప్రసాద్ శ్రీనివాసన్ క్వెస్ కార్ప్ ఈడీ*

ముమ్మందు ఇబ్బందే..

కంపెనీల వైఖరి.. ప్రస్తుతం దేశీయ ఐటీ రంగంలో నెలకొన్న మందగమనాన్ని సూచిస్తున్నట్టు నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ క్రమంలోనే ముమ్ముందూ ఐటీ రంగంలో పెద్దగా ఉద్యోగ నియామకాలు ఉండకపోవచ్చని, ఉన్నా.. అరకొర జీతాలకు ఫ్రెషర్లనే తీసుకుంటారని వారు చెప్తున్నారు. నిజానికి భారతీయ ఐటీ కంపెనీలకు అతిపెద్ద మార్కెట్ అమెరికానే. అగ్రరాజ్యంలో అంతా బాగుంటేనే కొత్త కొలువులకు వీలుంటుంది. అయితే అమెరికా ఎన్నికలు, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, ఐరోపా దేశాల్లో క్రిస్మస్, న్యూఇయర్ హాలీడే వాతావరణంతోనూ మార్కెట్ స్తబ్ధత చోటుచేసుకున్నదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిస్థితులు చక్కబడితే నియామకాల్లో జోరు పెరుగుతుందన్న అంచనాలూ ఉన్నాయి.

- **ఈ ఏడాది ఏప్రిల్-జూన్‌తో పోల్చితే జూలై-సెప్టెంబర్‌లో హెచ్‌సీఎల్ రెవిన్యూలో 57.2 శాతానికి తగ్గిన వేజ్ బిల్లు. అంతకు ముందు 58.5 శాతం.**
- **టీసీఎస్‌లోనూ 58.2 శాతం నుంచి 57 శాతానికి తగ్గుదల. ఇన్ఫోసిస్‌లో కూడా 52.6 శాతానికి దిగిన వైనం.**
- **విప్రోలో మాత్రం వేతన బిల్లు స్వల్పంగా పెరిగి రెవిన్యూలో 60.2 శాతం నుంచి 60.4 శాతానికి చేరింది.**
- **ఈ జూలై-సెప్టెంబర్‌లో టీసీఎస్‌లోకి 5,726 మంది, ఇన్ఫోసిస్‌లోకి 2,456 మంది . హెచ్‌సీఎల్‌లో 780 మంది, విప్రోలో 502 ఉద్యోగులు తగ్గుదల.**
- **ఐటీ సంస్థల్లో ఉద్యోగుల నిష్క్రమణకు సూచికగా ఉండే అట్రిషన్ రేటు ఈ జూలై-సెప్టెంబర్‌కుగాను హెచ్‌సీఎల్ టెక్నాలజీ, టీసీఎస్‌ల్లో 12.9 శాతంగా నమోదు. ఇన్ఫోసిస్‌లో 12.7 శాతం, విప్రోలో 14.5 శాతం.**

హైదరాబాద్‌లో థెర్మోఫిషర్ డిజైన్ సెంటర్

- **మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడి**

హైదరాబాద్, అక్టోబర్ 23 (నమస్తే తెలంగాణ): అమెరికాకు చెందిన థెర్మోఫిషర్ సైంటిఫిక్..హైదరాబాద్‌లోని జినోమ్ వ్యాలీలో బయోప్రాసెస్ డిజైన్ సెంటర్‌ను నెలకొల్పడానికి సిద్ధమైంది. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. 10 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తున్న ఈ డిజైన్ సెంటర్ వచ్చే ఏడాది తొలి త్రైమాసికంనాటికి అందుబాటులోకి రానున్నట్లు మంత్రి చెప్పారు. ప్రధానంగా ఔషధ పరిశ్రమకు, రోగనిర్ధారణ పరీక్షలకు అవసరమైన పరికరాలు, రసాయనాలు సరఫరా చేస్తున్న ఈ సంస్థ ఏర్పాటు చేస్తున్న డిజైన్ సెంటర్‌లో స్థానిక ఫార్మా, లైఫ్ సైన్సెస్ కంపెనీలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఎంతో పేరున్న ఈ సంస్థ దేశంలో అడుగుపెట్టడానికి ముఖ్యంగా తెలంగాణను ఎంచుకోవడం సంతోషదాయకమని చెప్పారు.

బిగ్'సి'లో దీపావళి డబుల్ ధమాకా ఆఫర్లు

హైదరాబాద్, అక్టోబర్ 23: ప్రముఖ మొబైల్ విక్రయ సంస్థ బిగ్'సి' దీపావళి పండుగను దృష్టిలో పెట్టుకొని డబుల్ ధమాకా ఆఫర్లను ప్రకటించింది. ప్రతి మొబైల్ కొనుగోలుపై రూ.10 వేల వరకు మొబైల్ ప్రొటెక్షన్‌ను ఉచితంగా అందించడంతోపాటు రూ.12 వేల వరకు తక్షణ క్యాష్ బ్యాక్, రూ.5,999 వరకు విలువ కలిగిన ఖచ్చితమైన బహుమతి, ఎలాంటి వడ్డీ, డౌన్‌పేమెంట్ లేకుండానే మొబైల్ కొనుగోలు చేసే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు బిగ్'సి' ఫౌండర్, సీఎండీ బాలు చౌదరి తెలిపారు. ఈ ఆఫర్లతోపాటు వివో, ఒప్పో, ఎంఐ, రియల్‌మీ మొబైళ్లు కొనుగోలుపై లక్కీడ్రాలో కార్లు, బైకులు, మొబైళ్లు గెలుచుకునే అవకాశం కూడా ఉంటుందన్నారు. ఈ దీపావళి ఆఫర్లతో పాటు బైబ్యాక్ ఆఫర్, జోడి ఆఫర్, స్మార్ట్ టీవీ ఆఫర్, బ్రాండెడ్ యాక్సెసరీస్‌పై 51 శాతం వరకు తగ్గింపుతో విక్రయిస్తున్నది. అలాగే ఏటీఎం కార్డుపై ఎలాంటి వడ్డీ, డౌన్‌పేమెంట్ లేకుండానే మొబైల్, స్మార్ట్ టీవీ, ల్యాప్‌టాప్, ఏసీలను కొనుగోలు చేయవచ్చును.

కేశోరాం మాజీ ప్రెసిడెంట్ జైన్ మృతి

పాలకుర్తి, అక్టోబర్ 23: బీకే బిర్లా గ్రూప్‌నకు చెందిన కేశోరాం సిమెంట్ కర్మాగారాన్ని నిర్మించి, 40 ఏండ్లు అన్నీ తానై నడిపిన కేసీ జైన్ (85) బుధవారం అనారోగ్యంతో హైదరాబాద్‌లో మృతిచెందారు. 1968లో బీకే బిర్లా గ్రూప్‌నకు చెందిన కేశోరాం సిమెంట్ కర్మాగారాన్ని ఈ ప్రాంతంలో నెలకొల్పినప్పటి నుంచి 2018 వరకు సుమారు 50 ఏండ్ల పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కర్మాగారం ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. బసంత్‌నగర్ సిమెంట్ ఫ్యాక్టరీ చుట్టు పక్కల గ్రామాల్లో వందలాది కుటుంబాలకు ఉపాధి కల్పించారు. బీకే బిర్లా గ్రూప్ అధినేత బసంత్‌కుమార్ బిర్లాకు అత్యంత సన్నిహితుడిగా ఉంటూ, కంపెనీలోని కేశోరాం గ్రూప్‌నకు డైరెక్టర్‌గా, బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారంతోపాటు, కర్ణాటక రాష్ట్రం సేడెం జిల్లాలోని వాసవదత్తా సిమెంటు, రాజస్థాన్ రాష్ట్రంలోని మంగళం సిమెంట్ కర్మాగాన్ని నడిపించారు.

మోబీక్విక్ ఎఫ్‌డీ స్కీం

న్యూఢిల్లీ, అక్టోబర్ 23: మొబైల్ యాప్ ద్వారా ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసుకునే అవకాశాన్ని కల్పించింది డిజిటల్ ఆర్థిక సేవల సంస్థ మోబిక్విక్. పొదుపు చేయడాన్ని మరింత సరళతరం చేయాలనే ఉద్దేశంతో మొబీక్విక్ ప్రారంభించిన ఈ ప్రత్యేక డిపాజిట్ స్కీంలో రూ.1,000 నుంచి ఎంతైన డిపాజిట్ చేయవచ్చును. ఎలాంటి బ్యాంక్ ఖాతా లేకుండానే డిపాజిట్లపై వార్షిక వడ్డీని 9.5 శాతం వరకు వడ్డీని ఆఫర్ చేస్తున్నది. ఏడు రోజుల నుంచి 60 నెలల కాలపరిమితిని ఎంపిక చేసుకునే అవకాశం ఉంది.

ఎన్ఎండీసీ ఖనిజ ధరల పెంపు

హైదరాబాద్, అక్టోబర్ 23: ఎన్ఎండీసీ మరోసారి తన ఖనిజ ధరలను పెంచింది. బుధవారం నుంచి అమలులోకి వచ్చేలా టన్ను లంప్సం ధరను రూ.600 పెంచడంతో రూ.6,350కి చేరుకోగా, నాణ్యమైన ఖనిజ రకం కూడా రూ.400 సవరించడంతో రూ.5,410కి చేరుకున్నది.

80 వేల పాయింట్ల దిగువకు సెన్సెక్స్



ముంబై, అక్టోబర్ 23: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడోరోజూ కూడా పతనం చెందాయి. మదుపరులు ప్రాఫిట్ బుకింగ్‌కు మొగ్గుచూపడం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను తరలించుకుపోవడంతో ఒక దశలో 80 వేల పాయింట్లకు దిగువకు పడిపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ చివర్లో భారీ నష్టాలను తగ్గించుకోగలిగింది. వాహన, ఫార్మా, క్యాపిటల్ గూడ్స్ రంగాలకు చెందిన షేర్లలో క్రయవిక్రయాలు జోరుగా సాగడంతో 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 138.74 పాయింట్లు నష్టపోయి 80,081.98 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ 36.60 పాయింట్లు పతనం చెంది 24,435.50 వద్దకు జారుకున్నది. 30 షేర్ల ఇండెక్స్ సూచీల్లో 22 సూచీలు నష్టపోగా, కేవలం ఎనిమిది లాభాల్లో ముగిశాయి. వీటిలో మహీంద్రా అండ్ మహీంద్రా, సన్ ఫార్మా, పవర్ గ్రిడ్, ఎన్‌టీపీసీ, అదానీ పోర్ట్స్, ఎల్అండ్‌టీ, ఐసీఐసీఐ బ్యాంక్, టైటాన్‌లు అత్యధికంగా నష్టపోయాయి. కానీ, బజాజ్ ఫైనాన్స మాత్రం 5 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది. దీంతోపాటు టెక్ మహీంద్రా, టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, బజాజ్ ఫిన్‌సర్వ్‌లు లాభాల్లో ముగిశాయి. రంగాలవారీగా చూస్తే పవర్ 1.39 శాతం, క్యాపిటల్ గూడ్స్ 1.17 శాతం, ఇండస్ట్రీయల్స్, వాహన, యుటిలిటీ రంగాలకు చెందిన షేర్లు భారీగా నష్టపోయాయి. కానీ, ఐటీ, టెక్, టెలికం, ఆర్థిక రంగ షేర్లు లాభాల్లో ముగిశాయి.

బంగారం హైజంప్

బంగారం ర్యాలీ కొనసాగుతున్నది. గత ఆరు రోజులుగా పెరుగుతూ వచ్చిన పుత్తడి బుధవారం కూడా మరో రికార్డు స్థాయికి చేరుకున్నాయి. పండుగ సీజన్‌కు తోడు పెళ్లిళ్ల సీజన్ కూడా కావడంతో బంగారానికి అనూహ్యంగా డిమాండ్ నెలకొన్నదని, దీంతో ధరలు మరో చారిత్రక గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. ఢిల్లీ బులియన్ మార్కెట్లో తులం పుత్తడి ధర రూ.500 ఎగబాకి రూ.81,500 పలికింది. గోల్డ్‌తోపాటు వెండి ఏకంగా రూ.1,000 పెరిగి రూ.1.02 లక్షలకు చేరుకున్నది. గత ఆరు రోజుల్లో కిలో వెండి రూ.10 వేలు, తులం పుత్తడి ధర రూ.2,850 పెరిగింది.

ఇండోఫాస్ట్‌తో రాపిడో జట్టు

హైదరాబాద్, అక్టోబర్ 23: రైడ్ సేవల సంస్థ రాపిడో..ఇండోఫాస్ట్‌తో జట్టుకట్టింది. ఈవీలతో రవాణా సదుపాయాలు అందించాలనే ఉద్దేశంతో పియాజియోకు చెందిన 10 వేల ఎలక్ట్రిక్ త్రీ-వీలర్, ఈ-సిటీ మ్యాక్స్‌లను అందుబాటులోకి తీసుకురాబోతున్నది. తొలి దశలో వెయ్యి ఈవీలతో హైదరాబాద్‌తోపాటు బెంగళూరులో రవాణా సదుపాయాలను సమకూరుస్తున్నట్లు తెలిపింది. దశలవారీగా వచ్చే రెండేండ్లలో ఈవీల సంఖ్యను 10 వేలకు పెంచుకోబోతున్నట్లు ప్రకటించింది. ఇండోఫాస్ట్ ఎనర్జీతో కుదుర్చుకున్న ఒప్పందంలో భాగంగా ఈవీలతో తమ కస్టమర్లకు రవాణా సదుపాయాలు సమకూర్చవచ్చునని ర్యాపిడో కో-ఫౌండర్ పవన్ గుంటుపల్లి తెలిపారు.

బాలికపై సీఐ లైంగిక వేధింపులు

- **తల్లిదండ్రుల ఫిర్యాదు.. ఇన్‌స్పెక్టర్‌పై పోక్సో కేసు**
- **కాజీపేట పీఎస్ పరిధిలో ఘటన**

సీఐ రవికుమార్

కాజీపేట, అక్టోబర్ 23: హనుమకొండ జిల్లా కాజీపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ సీఐ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం.. కాజీపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ అపార్ట్‌మెంట్‌లో సీఐ రవికుమార్ కుటుంబ సభ్యులతో నివాసముంటున్నాడు. ఈయన నివాసం ఉండే అపార్ట్‌మెంట్‌లోనే ఆయన కూతురి స్నేహితురాలి కుటుంబం కూడా ఉంటున్నది. సీఐ ఆ బాలికపై కన్నేశాడు. బాలిక ఒంటరిగా ఉన్న సమయంలో లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. దీంతో సదరు బాలిక విషయాన్ని తన కుటుంబ సభ్యులకు తెలిపింది. ఈ ఘటన ఈ నెల 9వ జరిగినప్పటికీ బాధితులు మంగళవారం రాత్రి కాజీపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఐపై పోక్సో కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

ఏసీబీకి చిక్కిన లైన్ ఇన్‌స్పెక్టర్

26 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు

నాగరాజు

పాల్వంచ, అక్టోబర్ 23 : ఓ వ్యక్తి నుంచి రూ.26 వేల లంచం తీసుకుంటూ విద్యుత్తు శాఖ లైన్ ఇన్‌స్పెక్టర్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఏసీబీ అధికారుల కథనం ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని కరకవాగు గ్రామానికి చెందిన గుగులోతు నాగరాజు ఇల్లు నిర్మించుకుంటున్నాడు. తాత్కాలికంగా పక్కనే ఉన్న తన మామ ఇంటి నుంచి కరెంట్ తీసుకున్నాడు. గమనించిన లైన్ ఇన్‌స్పెక్టర్ జినుగు నాగరాజు కేసు నమోదు చేస్తా నని నాగరాజును భయపెట్టాడు. కేసు లేకుండా చేయాలంటే రూ.65 వేలు లంచం డిమాండ్ చేయగా, 26 వేలకు ఒప్పందం కుదిరింది. బుధవారం పాల్వంచలోని అంబేద్కర్ కూడలిలో బాధితుడి నుంచి లైన్ ఇన్‌స్పెక్టర్ జినుగు నాగరాజు లంచం డబ్బులు తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ రమేశ్ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతడిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు.

అంబేద్కర్ అడ్డుగోడ కూల్చివేత

- **దళిత సంఘాల ఆధ్వర్యంలో అర్ధరాత్రి ఘటన**
- **అవమానిస్తే ఊరుకునేదే లేదని హెచ్చరిక**
- **అరెస్టులు.. విగ్రహం వద్ద బందోబస్తు**

అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్మించిన ప్రహరీని కూల్చిన దళిత సంఘాల నాయకులు

చిక్కడపల్లి/ఖైరతాబాద్, అక్టోబర్ 23: హైదరాబాద్ లోయర్ ట్యాంక్‌బండ్‌లోని బీఆర్ అంబేద్కర్ విగ్రహం చుట్టూ నిర్మించిన గోడను దళిత సంఘాల నాయకులు మంగళవారం అర్ధరాత్రి దాటాక కూల్చివేశారు. అంబేద్కర్ విగ్రహ పరిరక్షణ సమితి నాయకుడు వినోద్‌కుమార్, ఇతర దళిత నాయకులు ఈ చర్యకు పాల్పడ్డారు. ఆ తర్వాత అంబేద్కర్ విగ్రహం వద్ద కూర్చొని వారు నిరసన వ్యక్తంచేశారు. రాజ్యంగ నిర్మాతకు జరిగిన అవమానంగా భావించి దానిని కూల్చివేశామని వారు ఈ సందర్భంగా తెలిపారు. అంబేద్కర్‌ను ఏ రూపంలో అవమానించినా ఊరుకోబోమని హెచ్చరించారు. ఈ విషయం తెలిసిన సైదాబాద్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని దళిత సంఘాల నేతలను అదుపులోకి తీసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా గట్టి బందోబస్తు ఏర్పాటుచేశారు. బుధవారం మలమహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య, ఇతర దళిత సంఘాల నాయకులు అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకొని జీహెచ్ఎంసీ కమిషనర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఏసీపీ సంజయ్‌కుమార్, సీఐలు దళిత సంఘాల నేతులను సముదాయించారు.

అర్హులందరికీ రేషన్ కార్డులివ్వాలి

- **జెండా మోసిన కాంగ్రెస్ కార్యకర్త సీఎంకు విజ్ఞప్తి**
- **సిరిసిల్ల గాంధీ చౌరస్తాలో పోస్టర్ ఏర్పాటు.. సోషల్ మీడియాలో వైరల్**

సిరిసిల్లలోని గాంధీ చౌరస్తాలో జెండా మోసిన కార్యకర్తల పేరిట ఏర్పాటు చేసిన పోస్టర్

సిరిసిల్ల టౌన్, అక్టోబర్ 23: రాష్ట్రంలో అర్హులందరికీ రేషన్‌కార్డులు ఇవ్వాలని జెండా మోసిన కాంగ్రెస్ కార్యకర్త పేరిట బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని గాంధీ చౌరస్తాలో ఓ పోస్టర్ ఏర్పాటు చేశారు. 'సీఎం రేవంత్‌రెడ్డికి మా సమస్య తెలియజేస్తున్నది ఏమనగా.. మాజీ సీఎం కేసీఆర్ ప్రభుత్వంలో మాకు రేషన్‌కార్డులు రాలేదు. మన కాంగ్రెస్ ప్రభుత్వంలో అయినా వస్తాయని సంతోషించాం. నేను ఒక కూలీని. నాకు లేబర్‌కార్డు కావాలని ఆఫీస్‌కు వెళ్తే రేషన్‌కార్డు ఉంటేనే లేబర్‌కార్డు వస్తదన్నరు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చే పథకాలకు మేము అనర్హులుగా ఉన్నాము. నా లాంటి పేద ప్రజలు రేషన్‌కార్డుల కోసం ఎదురుచూస్తున్నారు. మా పేద ప్రజల సమస్యలు గుర్తించి రేషన్ కార్డులు జారీ చేయగలరు. నువ్వు తెలివి ఉన్న సీఎం అయితే రేషన్ కార్డుల సమస్యలు తీర్చు. మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేయకండి. ఖబడ్దార్ కాంగ్రెస్ ప్రభుత్వం.. సీఎం రేవంత్‌రెడ్డి' అంటూ పోస్టర్‌లో రాసి ఉంది. ఇది సోషల్ మీడియాలో వైరల్ అయింది.

మరో కౌలు రైతు ఆత్మహత్య

ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్‌లో విషాదం

గజానంద్ (ఫైల్)

గుడిహత్నూర్, అక్టోబర్ 23: అప్పుల బాధలు భరించలేక ఓ కౌలు రైతు తనువు చాలించాడు. సరైన దిగుబడి రాక.. పంట పెట్టుబడులు మీద పడి.. చేసిన అప్పులు తీర్చే దారిలేక వ్యవసాయ పొలంలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాద ఘటన మంగళవారం రాత్రి ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలం నేరడిగొండ తండాలో చోటు చేసుకుంది. తండాకు చెందిన ఆడె గజానంద్ (30) మూడేండ్ల నుంచి నాలుగెకరాల భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. ఏటా అనుకున్న స్థాయిలో దిగుబడి రాకపోవడంతో పంట పెట్టుబడుల కోసం రూ.6 లక్షలు అప్పు చేశాడు. గుడిహత్నూర్ మహారాష్ట్ర బ్యాంకులో రూ.3 లక్షలు, ఇచ్చోడ ఎస్‌బీఐలో రూ.1.50 లక్షలు, ప్రైవేట్‌గా మరో ఇద్దరి దగ్గర రూ.2 లక్షల చొప్పున అప్పు చేశాడు. ఈ ఏడాది కూడా దిగుబడి సరిగా లేక.. అప్పు ఎలా తీర్చాలనే బెంగతో మనస్తాపానికి గురయ్యాడు. చేసేదిలేక మంగళవారం సాయంత్రం చేను వద్ద పురుగుల మందు తాగాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని రి